పంటను ధ్వంసం చేసినవారిని శిక్షించాలి

అధికారులకు రాష్ట్ర మంత్రి పార్థసారథి ఆదేశం

ప్రజాశక్తి - ముసునూరు

పొగాకు పంటను ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన చెప్పు రాంబాబు తనకు ఉన్న 80 సెంట్లు అసైన్డ్ పట్టా భూమిలో పండించుకున్న పొగాకు పంటను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ముసునూరు పర్యటనకు వచ్చిన మంత్రి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో మంత్రి ఆ రైతు రాంబాబు పొలానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంటను ధ్వంసం చేసిన వ్యక్తిని త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని రైతుకు నష్టపరిహారం వెంటనే ఇప్పించాలని డివిజనల్ రెవెన్యూ అధికారి, పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ఆహార కల్తీ అరికట్టేదెవరు..!

- విచ్చలవిడిగా నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయాలు
- పెద్దపెద్ద హోటళ్ల నుంచి స్ట్రీట్ ఫుడ్ వరకూ అంతా కల్తీమయమే
- కలర్స్, నాణ్యత లేని నూనెల వాడకం వంటి ఎన్నో దుశ్చర్యలు
- కల్తీ ఆహారంతో రోగాల బారిన ప్రజలు
- ఫుడ్ సేఫ్టీ శాఖాధికారులు ఉన్నారా అని అనుమానాల వెల్లువ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల ప్రజలను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో ఆహారపు కల్తీ ఒకటి. నిత్యావసర వస్తువుల కల్తీ నుంచి రోజువారీగా హోటళ్లలో తినే ఆహారం సైతం విషతుల్యంగా మారడంతో జనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఊహించని రోగాలబారిన పడుతూ జనం ఆసుపత్రుల చుట్టూ తిరగలేక నరకయాతన పడుతున్నారు. పెద్దపెద్ద హోటళ్ల నుంచి స్ట్రీట్ ఫుడ్ వరకూ ప్రతిచోటా విచ్చలవిడిగా కల్తీ సాగుతోంది. ఆహారపు కల్తీపై రెండు జిల్లాల్లోని అధికార యంత్రాంగం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద పెద్ద రెస్టారెంట్లు ప్రతి పట్టణంలోనూ పదుల సంఖ్యలో ఉన్నాయి. స్ట్రీట్ ఫుడ్ అమ్మకాలు పట్టణాల నుంచి పల్లెల వరకూ విచ్చలవిడిగా సాగుతున్నాయి. ప్రతిఒక్కరూ ఫుడ్ డెలివరీ సంస్థల నుంచి ఆర్డర్ పెట్టుకుని రప్పించుకుంటున్నారు. ఒక్క ఏలూరు నగరంలోనే ప్రతిరోజూ రెండు వేల వరకూ ఫుడ్ ఆర్డర్స్ డెలివరీ అవుతున్నట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లోని ప్రధాన పట్టణాల్లో ప్రతిరోజూ వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకూ ఫుడ్ ఆర్డర్స్ డెలివరీ జరుగుతున్నట్లు అంచనా. ఇక స్ట్రీట్ ఫుడ్ తినేవారి సంఖ్యకు కొదవే లేదని చెప్పొచ్చు. ఫుడ్‌సేఫ్టీకి సంబంధించి నిబంధనలు సక్రమంగా అమలు కాని పరిస్థితి నెలకొంది. నిల్వ మాంసం, కలర్స్ కలపడం, నాణ్యమైన వంటనూనెలు వాడకపోవడం ఆరోగ్యాన్ని కబళించే అనేక రకాల పదార్థాలను కలుపుతున్న పరిస్థితి ఉంది. కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లు ఇలా తాగే పానీయాలు సైతం కల్తీమయమవుతున్నాయి. దీంతో వృత్తి రీత్యా బిజీగా ఉంటూ బయట ఆహారం తినే జనం అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో ఊహించని అనేక రోగాలు జనాలను చుట్టుముడుతున్నాయి. ఇటీవల కాలంలో రెండు జిల్లాల్లోనూ కేన్సర్ రోగులు అత్యధికంగా పెరుగుతున్నారు. ఆహారం కల్తీ కేన్సర్ రోగుల పెరుగుదలకు ఒక కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఆహారపు కల్తీ అతి పెద్ద సమస్యగా ఉంది. ఈ సమస్యపై అధికారులు కనీసం దృష్టి సారించకపోవడం విస్మయం కల్గిస్తోంది. ఆహారం కల్తీని అరికట్టేందుకు కనీస చర్యలు కూడా తీసుకుంటున్నట్లు ఎక్కడా కన్పించడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో కల్తీ మహమ్మారి జిల్లాలో రోజురోజుకీ విస్తరిస్తోంది. ఆహారపు కల్తీపై జిల్లా ఉన్నతాధికారులుసైతం పెద్దగా సమీక్షించి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఫుడ్ సేఫ్టీశాఖ కార్యాలయం

ఫుడ్ సేఫ్టీ శాఖ పని చేస్తుందా..?

ప్రజల ఆరోగ్యాన్ని కబళిస్తున్న ఆహారపు కల్తీని అరికట్టేందుకు పని చేయాల్సిన ఆహార భద్రత, ప్రమాణాల అమలు (ఫుడ్‌సేఫ్టీ) శాఖ జిల్లాలో ఉందా అనే సందేహం అందరిలోనూ నెలకొంది. ఏలూరు కోటదిబ్బపై ఈ శాఖ కార్యాలయం ఉంది. ఇక్కడ అధికారులు ఫుడ్‌సేఫ్టీపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఏఒక్కరికీ తెలియని పరిస్థితి. దాడులు ఏమైనా చేశారా.. కేసులు ఏమైనా నమోదయ్యాయా.. ఆహారం కల్తీపై తీసుకుంటున్న చర్యలు ఏమిటో ఏఒక్కరికీ అంతుచిక్కని ప్రశ్నగానే ఉంటోంది. ఈ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా కంప్యూటర్ ఆపరేటర్లు తప్ప ఎవరూ కన్పించరు. ఏదైనా సమాచారం అడిగినా పట్టించుకోరనే విమర్శలు ఉన్నాయి. సిబ్బంది తక్కువగా ఉన్నారనే కారణంతో ఆహారం కల్తీపై ఈ శాఖాధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. ఆహార భద్రతా ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేపట్టిన కార్యక్రమాలు సైతం పెద్దగా లేవంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఏలూరు నగరంలోనే పెద్దఎత్తున విచ్చలవిడిగా ఆహారపు కల్తీ సాగుతోంది. అధికారులు దాడులు చేస్తే వ్యాపారుల్లో ఎంతోకొంత భయం ఉంటుంది. పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆహారపు కల్తీ విచ్చలవిడిగా సాగుతుందనే చర్చ జనాల్లో నెలకొంది.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తేనే కల్తీకి చెక్

ఆహారపు కల్తీని అరికట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. టాస్క్‌ఫోర్స్ పేరుతో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడితేనే కల్తీకి చెక్ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇవి నిరంతరం కొనసాగుతుంటే ఆహారపు కల్తీకి కొంతమేరకైనా అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. ఇటీవల రెండు జిల్లాల్లో వస్తున్న రోగాలకు ప్రధాన కారణం నిత్యావసర, ఆహార పదార్థాల కల్తీనే అనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించేలా రెండు జిల్లాల ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటేనే జనానికి మేలు చేకూరే అవకాశం ఉంది.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - పెదపాడు

చదువుతోపాటు సమాజంలో మంచి పౌరుడిగా నిలిచేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు చదువు నేర్పించడం ఒక బాధ్యత అని, తల్లిదండ్రులు ఆ పిల్లల విద్య అభ్యాసన, వారిలో టాలెంట్ ఇతర అంశాలను పరిశీలించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులను బాధ్యత కలిగిన పౌరుడిగా తీర్చిదిద్దడంలో పాఠశాలపై ఎంతో బాధ్యత ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతోపాటు దేశానికి అవసరమైన ఉత్తమ పౌరులను అందించే దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. గురుకుల పాఠశాలలో విద్యాబోధన ఇతర కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఏవైనా సమస్యలుగాని, ఇబ్బందులు ఉంటే విద్యార్థినుల తల్లిదండ్రులు నిర్భయంగా తెలియజేయవచ్చన్నారు. ఈ సందర్భంగా పాతముప్పర్రుకు చెందిన ధను అనే మహిళ మాట్లాడుతూ తమ పాప ఇక్కడ పదో తరగతి చదువుతుందని, గురుకుల పాఠశాలలో తమ పిల్లను ఇంటికన్నా మిన్నగా చదువు, ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. పుష్పలత అనే మహిళ మాట్లాడుతూ తమ పిల్లలను గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించానని, ప్రస్తుతం వారు ఎనిమిదో తరగతికి చేరుకున్నారని, ఇక్కడ చదువు బాగా చెప్పడంతోపాటు వారి బాగోగులు కూడా ప్రిన్సిపల్ నుండి ఉపాధ్యాయులు వరకు ఎంతో శ్రద్ధగా చూసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో 94 శాతం సాధించారని, రానున్న కాలంలో ఇది నూరు శాతానికి చేరాలని ఆకాంక్షించారు. పెద్దఎత్తున తల్లిదండ్రులు హాజరు కావడం మంచి పరిణామమన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఎంఇఒలు నరసింహమూర్తి, రమ, కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, తహశీల్దార్ జ్యోతికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లల చదువును పర్యవేక్షించాలి
కలపర్రులో పలు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రతి విద్యార్థి భవిష్యత్తులో వారి విద్యానైపుణ్యం, క్రీడలు తదితరాల పట్ల వారికున్న అభిలాష తెలుసుకునేందుకు మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం మంచి వేదిక అని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాల్లో భాగంగా శనివారం మండలంలోని కలపర్రులో ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్య అభ్యసించానన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఉన్నతస్థాయిలో నిలుస్తారన్నారు. విద్యార్థుల్లో విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంచడం చాలా ముఖ్యమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పరం అభిప్రాయాలను పంచుకుంటూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించే దిశగా కృషి చేయాలన్నారు. పిల్లలు రూపొందించిన క్రాఫ్ట్ బొకేలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయన్నారు. పాఠశాల ఆవరణలో వేసిన రంగోళి ముగ్గులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలను ఆయా తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ప్రోగ్రెస్‌పై అందించిన ప్రత్యేక కార్డులను పరిశీలించారు. హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ మెడల్స్‌ను అందచేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాఠశాలలో భోజనం చేస్తున్న కలెక్టర్

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి భోజనం చేశారు. ఆహార పదార్థాల రుచిని చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారితో ముచ్చటించారు. ఆహారపదార్థాల నాణ్యతపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో మెనూని కచ్చితంగా పాటించాలని సూచించారు.

విద్యార్థులకు క్రమశిక్షణ, నిరంతర పర్యవేక్షణ అవసరం

రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

క్రమశిక్షణ, నిరంతర పర్యవేక్షణతో విద్యార్థులు ప్రపంచాన్ని జయిస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ హైస్కూలులో ఏర్పాటు చేసిన 'పిల్లల బంగారు భవిష్యత్ కోసం బడి వైపు ఒక అడుగు' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామానికి చెందిన దేవినేని వరప్రసాద్, ఆయన సోదరి దేవినేని రుక్మాబాయి ఆర్థిక సహాయంతో రూ.15 లక్షలతో నిర్మించిన వంటశాల డైనింగ్‌హాల్, వాలీబాల్ కోర్టులను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ పిల్లలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మధ్య నిరంతరం సత్సంబంధాలు ఉండాలన్నారు. మూడు నెలల పంట కోసం అనేక రోజులు కేటాయిస్తారని, అలాంటిది పిల్లల నూరేళ్ల భవిష్యత్ కోసం ఒక రోజు కేటాయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గతంలో పెద్దల సలహాలు, సూచనలతో పిల్లలు పెరిగేవారని, అది సమాజానికే శ్రేయస్సు అని అన్నారు. ఆధునిక కాలంలో సంపాదన కోసం పరుగులు పెడుతూ పిల్లలను పెద్దగా పట్టించుకోకపోవడంతో చెడు వ్యసనాల వైపు మళ్లుతున్నారని అన్నారు. పిల్లలకు కోట్లు సంపాదించి పెట్టడమే కాకుండా, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా ఎంతో నైపుణ్యం గలవారని, వారు నిబద్ధత, అంకితభావంతో పిల్లలకు అర్థమయ్యేలా చదువు చెప్పాలని అన్నారు. ఇంత పెద్ద సువిశాల పాఠశాల నిర్మాణానికి కారకులైన దాతలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దె రఘుబాబు, మెదరమెట్ల సురేంద్ర, పులి బళ్ల సత్యనారాయణ, గద్దల మోహనరావు, కొండేటి బాబి, రాపర్ల బాలకృష్ణ, నక్కా యోహాన్, తహశీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపిడిఒ జి.రాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భోజనశాలను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

జీలుగుమిల్లి ఉప తహశీల్దార్ సస్పెన్షన్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి ఉప తహశీల్దార్ బి.సందీప్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు వచ్చినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి భూ సేకరణలో భూములకు సంబంధించి అవినీతికి పాల్పడినట్లు తేలడంతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల బదిలీల అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా నాలుగు నెలల పాటు విధులు నిర్వహించిన సందీప్ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న గిరిజనేతర భూములకు, అదేవిధంగా ప్రభుత్వ అధికారులు కొన్న భూములకు, బోర్ సర్టిఫికెట్లు సైతం కార్యాలయంలోని ఓ మహిళ ఉద్యోగి తో కలిసి అక్రమంగా ఆన్‌లైన్లు చేసినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్‌కి పలువురు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. వీటిపై కూడా పూర్తి స్థాయి విచారణ చేసి దీనికి సహకరించిన కిందిస్థాయి ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అధికారులను కోరారు.

సాయుధ దళాల సేవలను గౌరవిద్దాం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఫ్లాగ్ డే ఫండ్‌కు చందా ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే నిధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫ్లాగ్ డే నిధికి విరాళ సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణలో సాయుధ దళాల పాత్ర వెలకట్టలేనిదన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన సైనికులను స్మరించుకునేందుకు ప్రతి ఏడాది డిసెంబర్ ఏడో తేదీన దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే నిర్వహించుకుంటున్నామన్నారు. అటువంటి త్యాగధనుల కుటుంబాల్లో వారి పిల్లల స్కాలర్‌షిప్స్, ఆడపిల్లలకు వివాహాలు తదితర కార్యక్రమాల కోసం ఫ్లాగ్ డే ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. అంతే కాకుండా మన సైనికులు దేశం సరిహద్దుల్లో పనిచేసిన ఉత్సాహంతో అదే స్ఫూర్తితో దేశంలో వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా తమ అమూల్యమైన సహాయ సహకారాలు స్వచ్ఛందంగా అందిస్తుంటారన్నారు. అటువంటి సైనికులు మాజీ సైనికుల సంక్షేమం పట్ల ఉద్దేశించిన ఫ్లాగ్ డే నిధికి మన వంతు సహకారం అందించడం పౌరులుగా మన కనీస బాధ్యత అని చెప్పారు. ఈ దృష్ట్యా జిల్లాలో ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, అధికారులు ఫ్లాగ్ డే ఫండ్‌కు విరివిగా చందాలు ఇచ్చి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెవి.సాయిప్రసాదరావు, ఎన్‌సిసి విద్యార్థినులు పాల్గొన్నారు.

జూదాలతో జీవితాలు నాశనం

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - చింతలపూడి

జూదాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. చింతలపూడి పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జూదాల వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని, ఈ అలవాట్లు వల్ల దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెరగాలని, ఫేక్ ఆడియో, వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జిల్లాలో ప్రతి గ్రామంలో 1973 గురించి అవగాహనా కల్పిస్తున్నామని, త్వరలో సైనిక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా లోన్‌యాప్‌లు, లింక్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎక్కువగా ఆశ పడకూడదని, అలాగే భయపడకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సిఐ రవీంద్ర, ఎస్‌ఐ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

భూసేకరణ పూర్తయ్యాకే రహదారి పనులు

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాకే జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి జాతీయ రహదారి, రెవెన్యూ అధికారులు, కిరాణా, వ్యాపార దుకాణాల యజమానులతో రెండోవిడత గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి మండలవ్యాప్తంగా భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాకే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. భూసేకరణకు సంబంధించి మొదటి విడతగా మండలంలోని రౌతుగూడెం, పి.అంకంపాలెం, బర్రింకలపాడు, తాటియాకులగూడెం గ్రామాల భూదస్త్రాల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు. స్థానిక ప్రధాన కూడలిలో రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించి కిరాణా, వ్యాపార దుకాణాల యాజమానుల భూ దస్త్రాలను పరిశీలించామన్నారు. జాతీయ రహదారి విస్తరణకు భూసేకరణలో భూములకు గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన కూడలిలో ఉన్న జగదాంబ ఆలయాన్ని గ్రామస్తుల సూచన మేరకు నిర్మించాలని తహశీల్దార్ స్లీవజోజిని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో సేకరిస్తున్న భూముల్లో ఎల్‌టిఆర్ వివాదాలు, గిరిజన, గిరిజనేతర వివాదాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.స్లీవజోజి, నేషనల్ హైవే తహశీల్దార్ పోతురాజు, డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్, ఎఇ ఖాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

కుమ్ములాటల్లో నేతలు.. కష్టాల్లో ప్రజలు..!

అధికారం కోల్పోయినా వైసిపిని అంతర్గత విబేధాలు వీడటం లేదు. అదే సమయంలో అధికార పార్టీ గూటికి చేరాలనుకునే ప్రతిపక్ష పార్టీ నేతలపై అధికార పక్షం నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఇదే సమయంలో విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల మోత, ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరల మోతతో జనం అష్టకష్టాలు పడుతున్నారు.

మాజీ డిప్యూటీ సిఎం, తాడేపల్లిగూడెం మాజీ ఎంఎల్‌ఎ కొట్టు సత్యనారాయణపై ఆ నియోజకవర్గంలోని వైసిపి నేతలే తిరుగుబావుటా ఎగురవేయడం గమనార్హం. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొట్టు సత్యనారాయణ వైఖరి ఏమాత్రం ఆమోద యోగ్యంగా ఉండటం లేదని, కార్యకర్తలను సైతం వేధిస్తున్నారంటూ నియోజకవర్గంలోని పలువురు నేతలు సమావేశమై బహిరంగ ఆరోపణలు చేయడం గమనార్హం. సాధారణంగానే కొట్టు మంత్రిగా పని చేస్తున్న కాలంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. కొట్టు వ్యవహార శైలి సైతం విమర్శలను మూటగట్టుకుంది. ఇదే క్రమంలో ఎన్నికల ముందు భీమవరంలో నిర్వహించిన సిద్ధం సభలో తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థిగా కొట్టు సత్యనారాయణను పరిచయం చేస్తూ 'అన్న మాట కఠినమేగాని, మనసు వెన్న' అంటూ వైసిపి అధినేత జగన్ వ్యాఖ్యానించడం విశేషం. ఈ క్రమంలో వైసిపి అధికారం కోల్పోయాక స్వపక్ష నేతలే తిరుగుబావుటా ఎగురవేయడం ఇటు కొట్టుకు, అటు వైసిపికి కచ్చితంగా ఇబ్బందికరమేనని పలువురు విశ్లేషిస్తున్నారు.

వైసిపిలో అంతర్గత కుమ్ములాటలు ఇలా ఉండగానే వైసిపి నుంచి టిడిపి గూటికి చేరుతున్న నేతలతో ఆ పార్టీలోని నేతలకు పొసగకపోవడం అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. మాజీ డిప్యూటీ సిఎం ఆళ్ల నాని ఇటీవల టిడిపిలో చేరుతున్నట్లు



పెద్దఎత్తున ప్రచారం సాగింది. అయితే టిడిపి ఏలూరు నియోజకవర్గ నేతలు నాని చేరికను తీవ్రంగా ప్రతిఘటించడంతో అది కాస్తా నిలిచిపోయింది. ఇదే క్రమంలో టిడిపి నేతలు నానిపై విమర్శల వర్షం కురిపించడం ప్రారంభించారు. అయితే టిడిపి అధిష్టానం మాత్రం నానిని పార్టీలో చేర్చుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈలోపు స్థానిక నేతలకు సర్దిచెప్పే బాధ్యత పార్టీ జిల్లా నేతకు, అలాగే ప్రజాప్రతినిధుల్లో కొందరికి బాధ్యత అప్పగించినట్లు సమాచారం. ఏదేమైనా వైసిపి నేతల రాకతో టిడిపి అధిష్టానానికి ఒకింత ఇబ్బందులు తప్పడం లేదని ప్రస్తుత పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి.

ఓపక్క నిత్యావసరాల ధరలతో సతమవుతుండగానే విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల మోత జిల్లావాసులకు గుదిబండగా మారింది. ఓపక్క ఉపాధి లేని పరిస్థితి, మరోపక్క ధరలు ఆశాన్నంటుతున్న తరుణంలో మార్కెట్‌లో అప్పు పుట్టక పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు జనానికి గుదిబండగా మారాయి. ప్రస్తుతం బిల్లులు చూసి జనం లబోదిబోమంటున్నారు. సాధారణంగా వచ్చే బిల్లుకన్నా కనీసం రూ.200కుపైగా అదనపు బిల్లు వచ్చిందని వినియోగదారులు వాపోతున్నారు. శీతాకాలం కావడంతో ఎసిలు, ఫ్యాన్లు పెద్దగా వాడని నేపథ్యంలోనే బిల్లులు కట్టలేని పరిస్థితి ఉందని, వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం బిల్లులు చూసి షాకవుతున్న వినియోగదారులు సొమ్ము చెల్లించాల్సిన సమయానికి ఎలా ప్రతిస్పందిస్తారో వేచిచూడాలి. ఏదేమైనా ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేతలు పక్క చూపులు చూస్తుండగా.. జనం మాత్రం కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

క్రిస్టియన్ల సంక్షేమానికి రూ.150 కోట్లు మంజూరు

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

క్రిస్టియన్ అభివృద్ధి, సంక్షేమానికి రూ.150 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు ఎంఆర్.అప్పారావు కాలనీలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలుకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఎంఆర్ అప్పారావు కాలనీ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. క్రిస్టియన్ సంక్షేమానికి వారి అభివృద్ధికి, జెరుసలేము యాత్రకు, విదేశీ విద్య అభ్యసించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని, వీటిని క్రిస్టియన్ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో 255 చర్చిలకు బడ్జెట్‌ను సిఎం చంద్రబాబు నాయుడు హయాంలోనే కేటాయించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కాలనీ పెద్దలు ఇళయరాజా, రమేష్, పట్టణంలోని పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - దెందులూరు

అంగన్‌వాడీలో చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. దెందులూరులో అంగన్వాడీ స్కూలును ఆమె శనివారం సందర్శించారు. ఆ సమయంలో ఆటపాటలతో అందిస్తున్న విద్యకు సంబంధించిన అంశాలను, నేర్పించాల్సిన పాఠాలను అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. పిల్లలందరూ చాలా యాక్టివ్‌గా ఉన్నారని, వారికి మధ్యాహ్నం అందించే అనుబంధ పోషకాహారాన్ని అందరూ రుచికరంగా తినే విధంగా చూడాలని చెప్పారు. కలెక్టర్‌తో పాటు ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, తహశీల్దార్ సుమతి, సిడిపిఒ విజయలక్ష్మి, డిసిపిఒ సూర్యచక్ర వేణి, సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్వాడీ టీచర్ హైమావతి పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పూర్వ విద్యార్థుల వితరణ అభినందనీయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాలుర హై స్కూల్‌కు పూర్వ విద్యార్థులు కంప్యూటర్, కలర్ ప్రింటర్లను శనివారం వితరణగా అందించారు. వాటిరని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ భాగవతుల హేమలతకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల వితరణ కార్యక్రమం అభినందనీయమన్నారు. ఇలాంటివారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధి కాంక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలపాల వెంకటేశ్వరరావు, జైసింగ్, ప్రభాకరరావు, పూర్ణచంద్రరావు, శివప్రసాద్, లింగాల అప్పారావు, మలిశెట్టి బాబి పాల్గొన్నారు.

ఘనంగా షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఉప ఆలయమైన శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో సుబ్రమణ్య షష్ఠి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. యాత్రికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆలయం వారు ఏర్పాట్లు చేశారు. ఎనిమిదో తేదీ ఆదివారం స్వామి వారి కావిడ ఉత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

టి.నరసాపురం : మండల కేంద్రమైన టి.నరసాపురంలో శ్రీఅన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి దివ్య క్షేత్ర ప్రాంగణంలో 16వ షష్ఠి మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి 8:30 గంటలకు ప్రాంగణంలో వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు నవీన దంపతులచే నిర్వహించారు. కల్యాణం అనంతరం శనివారం ఉదయం పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ఈ ఉత్సవాలను ప్రారంభించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కామినేని శ్రీనివాస్, మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు.

కలిదిండి : సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. వెంకటాపురంలో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, సర్పంచి గూడవల్లి శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, గ్రామ ప్రముఖులు షష్ఠి మహోత్సవాల్లో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెంలో చేసిన దాడిలో ఆదే గ్రామానికి చెందిన మహిళ వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నాటు సారా తయారీకి పనికొచ్చే భూమిలో పాతి పెట్టిన ప్లాస్టిక్ కవర్లలో నిల్వ ఉంచిన సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ మహిళపై స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్ : మండలంలోని ఓగిరాలతండా గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం... ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.ఆభయకుమారసింగ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు ఆధ్వర్యంలో ఓగిరాలతండా గ్రామంలో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, గుండయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. అనంతరం బి.శ్రీలత నూజివీడు ఎక్సైజ్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం గ్రామ పరిసర ప్రాంతాల్లో శనివారం జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద అక్రమంగా ఉంచిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన 25 మద్యం సీసాలను గుర్తించినట్లు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధ్యాపకులు, తల్లిదండ్రుల చేతుల్లోనే పిల్లల భవిష్యత్తు

ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం

పెదవేగిలో..

ప్రజాశక్తి - పెదవేగి

విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని, అందరం కలిసి భావిభారత పౌరులను తయారు చేయాల్సి ఉందని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. పెదవేగి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, టిడిపి జిల్లా సంయుక్త కార్యదర్శి తాతా సత్యనారాయణ, సిడిపిఒ రాజశేఖర్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వివిధ కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, సహపంక్తి భోజనాలు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో అన్ని సౌకర్యాలతో చక్కని విద్య అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పూజారి రాంబాబు, మన్నే రాఘవేంద్రరావు, రాజాశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

దెందులూరు : చదువులో పోటీ పడడంతో పాటు ఆటలపై కూడా ఆసక్తి చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. దెందులూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బాల సదన్‌లో పిల్లలకు పేరెంట్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ఎంతో ఆప్యాయతతో ఆ పిల్లలను దగ్గర ఉండి పాఠశాలకు తీసుకొచ్చారు. అనంతరం పాఠశాలలోని ప్రతి తరగతి గదులను సందర్శించి ప్రతి బెంచ్ దగ్గరకు వెళ్లి ఎంతో ఆప్యాయతతో విద్యార్థినులతో కరచాలనం చేస్తూ వారి పేర్లు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు వారి చదువు పట్ల ఆరా తీశారు. కలెక్టర్ దత్తత తీసుకున్న పిల్లలకు అందించిన సమగ్ర విద్యాప్రగతి పత్రాల(హెూలిస్టిక్ కార్డులు)ను పరిశీలించి వారి విద్యాప్రగతి తీరును పరిశీలించారు. ఇంకా మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కష్టపడాలని సూచించారు. సంబంధిత కార్డులపై కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్సు సబ్జెక్టులో పిల్లలకు మరింత మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు చదువులో పోటీపడి మంచి



ఏలూరులో...

ప్రగతి సాధించాలని, అదే సమయంలో ఆటలపై కూడా అసక్తి చూపాలని సూచించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలసదన్‌కు చెందిన ఆర్.భూలక్ష్మి హెూలిస్టిక్ కార్డును పరిశీలించి విద్యపై పూర్తి ధ్యాస పెట్టి ఒక్కొక్క స్థానాన్ని ఎగబాకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, డిసిపిఒ సూర్యచక్రవేణి, సిడిపిఒ విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీదేవి, పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు, పలువురు ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ ధాత్రిరెడ్డి తెలిపారు. కెఆర్.పురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల తెల్లంవారిగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో వివిధ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యాబోధనలు చేస్తున్నారని తెలిపారు. క్రీడా, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పేరుతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభోధనలపై తరచూ పర్యవేక్షణ చేస్తూ సమావేశం నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలల్లో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల గురించి జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒలు పాల్గొన్నారు.

చింతలపూడి : విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని, తమ వంతుగా సమాజాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. స్థానిక సుబ్బారాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు చాలా సంతోషంగా ఉన్నారని, ఆడపిల్లలు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల పట్ల ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడాలనే విధంగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారాజు హైస్కూల్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఎంఇఒ కిరణ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ పావని, చింతలపూడి సిఐ రవీంద్రనాయక్, ఎస్ఐ కుటుంబరావు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

ఏలూరు సిటీ : మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఆత్మీయ బంధం ఏర్పడుతుందని, తద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు అగ్రహారంలోని కస్తూరీ బా మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల మధ్య అవినాభావ సంబంధాలు మెరుగుపడితే విద్యా ప్రమాణాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. తల్లిదండ్రులు ఆటల పోటీల్లో పాల్గొనడం ద్వారా పిల్లలకు వారు ఆదర్శవంతంగా నిలుస్తారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన తల్లిదండ్రులకు ఆయన బహుమతులు అందించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జల్లా వీరభద్రరావు, శంకర వెంకట సుబ్బారావు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, పలువురు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరులోని పుష్పలీల నగర్ 28వ డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర పాఠశాలలో, తంగెళ్లమూడి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో నిర్వహింన సమావేశానికి కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తంగిరాల అరుణసురేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించి పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాష్, ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని బర్రింకలపాడు, అంకన్నగూడెం గిరిజన పాఠశాలల్లో నిర్వహించిన సమావేశంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా ఉన్న 48 పాఠశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంఇఒ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రజాఉల్ల, ఎంఇఒ-2 బుచ్చయ్య, ప్రిన్సిపల్ స్వామి, జనసేన పార్టీ మండల ప్రెసిడెంట్ పి.రాము, పీడీ రమేష్, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ఎస్‌సి కాలనీలో ఉన్న ఎంపిపి పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాలల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో తల్లితండ్రులు పాల్గొన్నారు. పోటీల్లో గెలిచిన వారికి ఎంఇఒ జె.సురేష్‌బాబు చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ చంద్రశేఖర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పులపల్లి పద్మ, వార్డ్ మెంబర్ రవికుమార్, బొబ్బర మంగరాజు, రమేష్, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, సుశీల రాజకుమారి, రాజ్యలక్ష్మి, కనకమహాలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చాట్రాయి : చనుబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విశ్వభారతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సమగ్ర ప్రగతి పత్రాలను అందించారు. తల్లులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పేరెంట్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణారావుపాలెం ఎంపిపి పాఠశాలలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు బహుమతులను అందించారు. చాట్రాయి ఎంపిపి మెయిన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.రాము ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

నూజివీడు టౌన్ : మండలంలోని రావిచర్ల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి టిడిపి సీనియర్ నాయకులు కాపా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, ఉప సర్పంచి మోషే, పంచాయతీ వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని బండివారిగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం. బొర్రంపాలెం, వీరభద్రవరం, రాజుపోతెపల్లి తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో తొలుత తల్లిదండ్రులకు ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల ప్రతిభపై ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి చర్చించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఇఒ టి.రామ్మూర్తి, ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, సర్పంచి నాళం టిరీషా, ఎం.గోపాలరావు, ఎ.శ్రీనివాసరావు, శీలం వెంకటేశ్వరరావు, నల్లూరి చలపతిరావు, పిన్నమనేని మధు, సోంబాబు, వెంకటేశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయులు ఆలీ, లింగస్వామి, బాజా, శ్రీను పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, ఎంపిపి పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. గూటాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ సాయిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. తల్లిదండ్రులు కలిసికట్టుగా కృషి చేసినప్పుడే పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన వారవుతామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ మాట్లాడుతూ పాఠశాలలో గతేడాది పదో తరగతిలో సాధించిన విజయాలను, దాతల కృషిని అభినందించారు. సుమారు 150 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతి తరగతిలోని విద్యార్థుల విద్యా విషయక ప్రగతిని, వారి ఆరోగ్య సమాచారాన్ని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న పలు కార్యక్రమాలను పలువురు తల్లిదండ్రులు అభినందించారు.



బుట్టాయగూడెంలో...

కుక్కునూరు : మండలంలోని పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో అనేక స్కూళ్లను సందర్శించారు. రామసింగారం ఎంపిపి స్కూల్‌లో, గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం కెజిబివి స్కూల్‌లో, స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమం పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగు మాట్లాడుతూ విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆహారం విషయంలో నాణ్యత పాటించాలని ఉపాధ్యాయులను కోరారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచినవారికి రూ.పది వేలు నగదు మొదటి బహుమతి ఇస్తానని హామీ ఇచ్చారు. జనసేన మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ మండలంలో పదో తరగతిలో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.ఐదు నగదు బహుమతి ఇస్తానని హామీ ఇచ్చారు.



హెచ్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

కుక్కునూరు : మండలంలోని సీతారామనగరం హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు చదువు సరిగా రావడంలేదన్నారు. మా పిల్లల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులను నియమించండి.... లేదా మా పిల్లలకు పని నేర్పేందుకు అనుమతి ఇవ్వండి... అని తీర్మానించి రాసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మరాజుకు వినతిపత్రం అందించారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సోషల్, గణితం సబ్జెక్టు టీచర్స్ లేకపోవడంతో పిల్లలకు సరైన విద్య అండటంలేదన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ వెంటనే స్పందించి పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

మహారాజశ్రీ మొవ్వ జూనియర్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టువారు
ఐ.ఏ. నెం. 665/2024 ఇన్
ఓ.యస్. నెం. 118/2019

బిట్వీన్ :
మహాళి శివశంకర రాజు .... పిటీషనర్/వాది
మరియు
దంతులూరి రవివర్మ వగైరా
..... రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు,
డి1 : దంతులూరి రవివర్మ, తండ్రి : విజయవర్మ, హిందూ, వయస్సు 43 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 11-13-29, కందికట్ల వారి వీధి, గునుపూడి గ్రామం, భీమవరం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు ఐ.ఏ.లోని దావాలో సదరు కోర్టువారి నుండి మీకు చాలాసార్లు దావా సమన్లు పంపించినారు. మీరు ఉద్దేశ్య పూర్వకంగా పుచ్చుకొనని యెడల చివరకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని కోర్టువారు ఆర్డరు వేసియున్నారు. మీ హాజరు నిమిత్తం ది. 10-12-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

మొవ్వ
ది.7-12-2024 **సర్వా రామ్మోహన్ ప్రసాద్, పిటీషనర్ / వాది తరపు న్యాయవాది, మొవ్వ.**

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.435/2023 in O.S.28/2008

Betwee:
లంక రాంబాబు ...పిటిషనర్
and
కొరుప్రోలు నాగరాజు(డైడ్)వగైరా ...రెస్పాండెంట్లు

To.
R9. నవుడు నాగలక్ష్మి W/0.నూకరాజు, వయస్సు 37 సం॥లు.సా॥జంగారెడ్డి గూడెం, ప॥గో॥జిల్లా
R10. సబ్బారపు యేసమ్మ W/0.వాసు, వయస్సు 36 సం॥లు, సా॥పట్టిసీమ, ప॥గో॥జిల్లా
R12. కైశర్ల వీరబాబు S/0 సాంబమూర్తి, వయస్సు 45 సం॥లు. సా॥జంగారెడ్డి గూడెం, ప॥గో॥జిల్లా
R13. కైశర్ల చిన్న S/0 సాంబమూర్తి, వయస్సు 39 సం॥లు. సా॥ జంగారెడ్డి గూడెం, ప॥గో॥జిల్లా

ఈ నంబర్ దావాలో చనిపోయిన 4వ ప్రతివాది అయిన కైశర్ల చంటికి మిమ్ములను వారసులుగా చేర్పించమని, పిటీషనర్ పై నంబర్ **I.A.435/2023** పిటిషన్ దాఖలు చేసినందున మీకు నోటీసు నిమిత్తం ది.వి. **13-12-2024** తేదికి వాయిదా వేసినారు. కావున మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యడల మీరు ది.వి. **13-12-2024** తేదిని ఉదయం **10.30** నిమిషాల నుండి పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకోవలెను. లేని యడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సాదే నరసింహారావు
T(సాదే) జయశ్రీ అపూర్వ
అడ్వకేట్స్, రామారావుపేట
పెద్దాపురం-533437
పెద్దాపురం సెల్:9885084194
06-12-2024 పిటీనర్ తరపు న్యాయవాదులు

పిల్లలను దత్తత తీసుకోవడం అభినందనీయం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు బాలసదనంలో ఆశ్రయం పొందుతూ ప్రస్తుతం వేలేరుపాడు కెజిబివిలో ఏడో తరగతి చదువుతున్న కుమారి నూకాలు అనే పాపను కేరింగ్స్ పోర్టల్ ద్వారా రిఫరల్ పొంది 2021లో దరఖాస్తు చేసుకున్న శీలం జిల్లా తమిళనాడు రాష్ట్రానికి చెందిన జనార్ధన్, సీత లక్ష్మి దంపతులకు అప్పగించారు. దత్తత నియమ నిబంధనల ప్రకారం అవసరమైన దరఖాస్తులు ఇతర ధ్రువీకరణ పత్రాలన్ని జిల్లా దత్తత కమిటీ వారు తనిఖీ చేసిన తర్వాత కలెక్టర్ వెట్రిసెల్వి రిజర్వ్ చేసుకున్న తల్లిదండ్రులకు శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో అప్పగించారు. అదేవిధంగా రెండు నెలల క్రితం దత్తత ప్రీ అడాప్షన్ పాస్టర్ కేర్ ఇచ్చిన బాలలు మహిమ ప్రస్తుత పేరు టియాన కౌర్ వయస్సు ఏడు నెలలు, జగ్మిందర్ సింగ్, సోనాల్ కౌర్ హైదరాబాద్ వారు, విల్సన్ పాల్ ప్రస్తుత పేరు సాయి కిరణ్ వయసు 13 సంవత్సరాలు నాగన్నలక్ష్మి ఆదిలాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఇద్దరిని కూడా జిల్లా బాలల సంరక్షణ యూనిట్ వారు తనిఖీలు పూర్తి చేసిన తర్వాత కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ హోదాలో ఫైనల్ ఎడాప్షన్ ఆర్డర్ ఇవ్వటానికి అవసరమయ్యే దరఖాస్తులు పరిశీలించారు. తర్వాత మొదట వారిని ఫిజికల్‌గా ప్రెసెంట్ చేసి వారి బంధవ్యాన్ని, అర్థం చేసుకుని తర్వాత పిల్లలు తల్లిదండ్రులతో కలిసిపోయిన విధానాన్ని, వారి ఆహారపు అలవాట్లను, వారి భవిష్యత్తు ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించి వారిద్దరికీ కూడా వారు దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు న్యాచురల్ గార్డియన్‌లుగా ఫైనల్‌గా సొంత తల్లిదండ్రులుగా గుర్తిస్తూ ఫైనల్ ఎడాప్షన్ ఆర్డర్‌ను అందించారు. ఈ కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దత్తత తీసుకున్న పిల్లలను మంచి వాతావరణంలో పెంచి వారికి విద్యా బోధనలు నేర్పించి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేయాలని కోరారు. ఏడేళ్ల అమ్మాయిని దత్తత తీసుకున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, శిశుగృహ మేనేజర్ భార్గవి, డిసిపియు సిబ్బంది రాజేష్, రాజు పాల్గొన్నారు.

దత్తత ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షునిగా ముత్తయ్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులుగా ముదగల ముత్తయ్య ఎంపికయ్యారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నేత పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విస్సంపల్లి సిద్ధు మాదిగ మాట్లాడుతూ మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరావు మాదిగ, రాష్ట్ర కార్యదర్శి పెరెల్లి ఎలీషా మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన ముదగళ్ల ముత్తయ్య మాదిగను ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులుగా, మండల అధికార ప్రతినిధిగా నార్లపాటి ప్రసాద్ మాదిగను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు బొడ్డపాటి పండు మాదిగ, మండల నాయకులు తుట్టి ఈశ్వరరావు, దొర చెప్పుల ఏసు పేరయ్య, నార్లపాటి దుర్గారావు పాల్గొన్నారు.

పాఠశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో'

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పంగిడి గూడెం హైస్కూల్‌లో భీమడోలు సిఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ శనివారం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విల్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి, ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. మత్తు పదార్థాల వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతిని సక్రమంగా చదువుకోరని, ఆరోగ్యం పాడవుతుందని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అనర్థాల గురించి వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏదైనా ఆపద సమయంలో అత్యవసరంగా పోలీసువారి సేవలు వినియోగించుకునేందుకు డయల్ 112కు సమాచారం అందిస్తే పది నిమిషాల వ్యవధిలో పోలీసు వారు మీకు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. మీ చుట్టూ జరిగే అసాంఘిక కార్యకలాపాలు, చర్యల గురించి వాట్సాప్ నెంబర్ 9550351100 ద్వారా పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మాట్లాడుతున్న వక్తలు

IN THE COURT OF THE 2nd ADDITIONAL CIVIL JUDGE CUM 2nd ADDL. JUDICIAL MAGISTRATE OF 1st CLASS AT BHIMAVARAM
I.A.No.176/2023 in O.S.No.419/2023

Between:
Kalla Harinadh Babu ...Petitioner/Plaintiff
And
Jakkamsetty Padmavathi and 3 Others ...Respondents/Defendants

2nd Respondent/Defendant:
Kadali Pavani Kumari, W/o.Srikanth, D.No.13-5-3, Guduri Anjaneyulu Streeet, 16th Ward, Gunupudi, Bhimavaram, West Godavari Dist., A.P.

పై నెంబర్లు I.A.176/2023 మరియు దావా నెంబరు 419/2023లోను పిటిషనర్/వాది అనేక పర్యాయములు మీకు నోటీసులు కోర్టు ద్వారాను, పోస్టల్ ద్వారాను పంపించినను, సదరు I.A. నోటీసులు, దావా సమనులను మీరు ఉద్దేశ్యపూర్వకముగా అందుకొనియుండుట లేదు. అందువలన శ్రీగౌరవనీయులైన కోర్టు వారు Substitute Service ద్వారా అమలు చెయ్యమని ఆర్డరు వేసియున్నారు. మీరు ది.19.12.2024 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పైకోర్టు వారి యెదుట మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. అట్లు హాజరు కానిచో పరోక్షములో సదరు పిటిషన్ మరియు దావాను తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 19-12-2024
భీమవరం **పి.రాజారావు**
అడ్వకేట్, భీమవరం.
సెల్: 94401 30111.